క్లుప్తంగా

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

బంగారుపాళెం: మండల కేంద్రంలో ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించను న్నారని ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బంగారుపాళెం-1, 2 గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఆవు, దూడ వితరణ



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి చిత్తూరుకు చెందిన సంజీవ్‌కుమార్, రాజ్‌కుమార్ శనివారం ఆవు, దూడ, గో సంరక్షణ ట్రస్టుకు రూ.50 వేలును వితరణగా అందించారు. ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డిని కలిసి వీటిని అందించారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, వేదపండితులతో ఆశీర్వచనం ఇప్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

చెస్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులో ఫిబ్రవరి 12న జరగనున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ పోటీల పోస్టర్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఆ రోజు చిత్తూరులో జరిగే పోటీలకు ముందుస్తుగా 98493 13676 నంబరును సంప్రదించి నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీసీడీఏ అధ్యక్షుడు ప్రసాద్, నిర్వాహకులు, సభ్యులు శ్రీధర్, ఆది, బాలు, అడ్వొకేట్ కిషోర్, దినేష్, ఖాదర్, గజ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని పలు ఆలయాల వద్ద ఉన్న నిరాశ్రయులకు శనివారం దాత పార్థసారథి నాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. 85 మందికి దుప్పట్లు అందజేశారు. చలితీవ్రత దృష్ట్యా వారికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

శుభ్రతతో వ్యాధులు దూరం

తవణంపల్లె: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయచౌదరి తెలిపారు. శనివారం మండలంలోని అరగొండ సచివాలయం పరిధిలోని చారాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలన్నారు. గర్భిణులు రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ శిబిరంలో 122 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, అమరావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమ్మమ్మ మృతి



చిత్తూరు రూరల్: పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు అమ్మమ్మ కె.పాపమ్మ(102) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. చిత్తూరు మండలం పచ్చన్నపల్లెలోని ఆమె భౌతికాయానికి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఎం.ఎస్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు రాబర్ట్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

చిత్తూరు రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, డ్రైవింగ్‌లో ఆరోగ్య సూత్రాలు పాటించాలని చిత్తూరు లారీ యజమానుల అసోసియేషన్ కార్యదర్శి సుకుమార్ అన్నారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్), అవేర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక మురకంబట్టు బైపాస్‌లో లారీ యజమానుల అసోసియేషన్ కార్యాలయంలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. లారీ డ్రైవర్లు, క్లీనర్లకు చికిత్స అందించి ఉచితంగా మందులు అందజేశారు.

బకాయిదారులపై చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థకు అధిక మొత్తంలో ఆస్తి పన్ను చెల్లించాల్సిన బకాయిదారులపై సత్వరం చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ అరుణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం నగరపాలక కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సహాయ కమిషనర్ గోవర్ధన్, ఆర్‌ఐలు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, అన్ని వార్డుల పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా పాత బకాయిలు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని, అధికమొత్తంలో ఆస్తిపన్ను బకాయి పడిన వారికి సత్వరం నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలని, ఆర్‌ఐలు, అడ్మిన్ కార్యదర్శులు లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. వార్డుల వారీగా ఆస్తి పన్ను డిమాండ్, వసూలు, పాత బకాయిలపై ఆర్‌ఐలు, అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. రోజువారీ వసూలు వివరాలను సమర్పించాలని ఆదేశించారు.

కన్వీనర్లదే క్రియాశీలక పాత్ర

- 25లోపు గృహ సారథులను నియమించాలి
- జగనన్న సచివాలయ రాష్ట్ర కన్వీనర్ శివశంకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, జేఎస్‌సీ రాష్ట్ర కన్వీనర్ శివశంకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రానున్న కాలంలో కన్వీనర్లు, గృహసారథులే క్రియాశీలక పాత్ర పోషిస్తారని జగనన్న సచివాలయ రాష్ట్ర కన్వీనర్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం చిత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా అందుతున్న లబ్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. ఈనెల 25వ తేదీలోపు గృహసారథుల నియామకం పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరిలో గృహసారథులకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వారు క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనిస్తూ కన్వీనర్లకు సమాచారం అందజేయాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయండి

మండల, నగర ఇన్‌చార్జులతో కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయం చేసుకొని పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ సూచించారు. అందరూ కలసి కట్టుగా పనిచేసి జిల్లాలోని 7 ఎమ్మెల్యే సీట్లు గెలుచుకుందామని పిలుపునిచ్చారు. కుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని స్పష్టం చేశారు. కన్వీనర్లు, గృహ సారథులు బాధ్యతగా పనిచేసి పార్టీకి మంచిపేరు తీసుకురావాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. అందరూ కష్టపడి పనిచేస్తే తప్పకుండా విజయం సాధిస్తామని చెప్పారు. ప్రస్తుతం కన్వీనర్ల నియామకం పూర్తయిందని, గృహసారథుల నియామకం దాదాపు పూర్తి చేశామని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అందరి ఇంటి పెద్దగా జగనన్న వ్యవహరిస్తూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా అందుతున్నాయని వివరించారు. 175 సీట్లు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. గత పాలన కంటే అన్ని విధాలా వైఎస్సార్‌సీపీ పరిపాలన బాగుందని గుర్తుచేశారు. పట్టభద్రుల ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్, చిత్తూరు నగరపాలక డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్లు ఆనంద పార్థసారథి, జింకా చలపతి, షమీమ్ అస్లాం, రెడ్డెప్ప పాల్గొన్నారు.

వలంటీర్లపై ఏడుపు ఎందుకు ?

ప్రజలకు సంక్షేమ పథకాలను ఇంటింటికి చేరవేస్తున్న వలంటీర్ల మీద టీడీపీ అనుకూల మీడియాలో నిత్యం విషప్రచారం చేయడం సరికాదని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ధ్వజమెత్తారు. శనివారం చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ వలంటీర్లుగా ఎల్లో మీడియా నిర్వాహకులు పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కరోనా లాంటి క్లిష్ట సమయంలో వారు అందించిన సేవలు వెలకట్టలేనిదన్నారు. ప్రతినెల 1వతేది ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇస్తున్న వారి సేవలను వక్రీకరించడం సరికాదని హితవు పలికారు. ఎక్కడైనా తప్పు జరిగిందని చూపితే వాటికి సమాధానాలు ఇస్తామన్నారు. అంతే కానీ పనిగట్టుకుని రోజూ తప్పుడు ప్రచారాలు చేయడమేమిటన్నారు. లంచాలకు అతీతంగా ప్రజలకు వలంటీర్లు సేవ చేయడం ఎల్లో మీడియాకు నచ్చడం లేదని విమర్శించారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు ప్రతి పనికి ఓ రేటు పెట్టుకొని దోచుకోవడంపై వార్తలు ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. గౌరవవేతనంతో గొప్ప సేవలు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థ మీద విషం చిమ్మడం దురదృష్టకరమన్నారు. ఒక పెత్తందారీ వ్యవస్థకు అధికారాన్ని ఇవ్వాలనే ఆకాంక్షతో ఆ మీడియా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, చిత్తూరు మేయర్ అముద, కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, చిత్తూరు డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత జీవితానికి రక్షణ



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వాసుదేవరెడ్డి

గుడిపాల: రహదారి భద్రత జీవితానికి రక్షణ అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వాసుదేవరెడ్డి, రాజేశ్వరరావు అన్నారు. 34వ జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం సీఎస్‌ఆర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కుమారి భాగ్యశ్రీ, కరస్పాండెంట్ లోకేష్, ప్రిన్సిపాల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్ పాల్గొన్నారు.

పోలీస్ పరీక్ష కేంద్రాల తనిఖీ

గుడిపాల: పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష కేంద్రాలను ఎస్ఐ రాజశేఖర్ శనివారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని సీఎస్‌ఆర్ కళాశాలలో ఆదివారం కానిస్టేబుల్ పరీక్షలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ మొత్తం 13 గదుల్లో 300 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం రూమ్‌లను తనిఖీ చేసి పలు సూచనలను తెలియజేశారు.

కామర్స్‌ఫెస్ట్ చాంపియన్ ఆర్‌కే



చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని మిట్టూరులో ఉన్న ఆర్‌కే విద్యాలయ జూనియర్ కాలేజీ కామర్స్ ఫెస్ట్ చాంపియన్‌ను కైవసం చేసుకుంది. వేలూరుకు చెందిన విట్ యూనివర్సిటీ ప్రతి ఏటా కామర్స్ ఫెస్ట్‌ను నిర్వహిస్తోంది. 2023లో నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో నగరానికి చెందిన ఆర్‌కే విద్యాలయ జూనియర్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా గెలుపొందారు. ఈ మేరకు శనివారం ఆ కళాశాల కరస్పాండెంట్ బద్రీనారాయణ మాట్లాడుతూ మొత్తం 33 కళాశాలలు పోటీల్లో పాల్గొనగా తమ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

బీసీ సంఘం నూతన కమిటీ

పూతలపట్టు: బీసీ సంక్షేమ సంఘ మండల కమిటీ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.రమేష్, గౌరవ అధ్యక్షుడిగా పురుషోత్తం, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా భాస్కర్, ప్రచార కార్యదర్శిగా దేవేంద్ర, రాజేష్ ఎన్నుకున్నారు. ఎంపీపీ చంద్ర పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారం

పూతలపట్టు: మండలంలోని తలపలపల్లె-వడ్డేపల్లె రోడ్డు సమస్యను తహసీల్దార్ విజయభాస్కర్ పరిష్కరించారు. శనివారం తహసీల్దార్‌తోపాటు ఎస్ఐ హరిప్రసాద్ ఆగ్రామాలకు సిబ్బందితో వెళ్లి స్థలాన్ని సర్వే చేశారు. 8 అడుగులు ఉన్న దారిని 12 అడుగులుగా విస్తరించి సమస్యల పరిష్కరించారు.

ఆ పనులను వెంటనే ప్రారంభించండి



మాట్లాడుతున్న కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అనుమతులు ఇచ్చిన పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. శనివారం ఆయన క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 1972 పనులను మంజూరు చేశామన్నారు. ఇందుకు రూ.61 కోట్లతో అంచనాలు తయారు చేసినట్టు వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.7 కోట్ల విలువ చేసే పనులను పూర్తిచేశారని చెప్పారు. ప్రజాప్రతినిధులు ఏ గ్రామాల్లో 100 శాతం పర్యటనలు పూర్తిచేశారో ఆ గ్రామంలో గుర్తించిన పనులను వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. అప్‌లోడ్ చేసిన పనులకు అనుమతులు వచ్చిన వెంటనే అంచనాలను సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ 943 పనులకు గాను 105, పంచాయతీరాజ్ శాఖ 794కు గాను 60 పనులు, చిత్తూరు మునిసిపల్‌శాఖలో 66 పనులకు 18, జిల్లాలోని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో 118 పనులకు 41 పనులు పూర్తయినట్లు తెలిపారు. చేపడుతున్న పనులను మరింత వేగవంతం చేసి బిల్లులను త్వరితగతిన అప్‌లోడ్ చేసేలా ఆయా శాఖల ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పురోగతిలో వెనుకబడిన మండలాల పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగజ్యోతి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతతో పని చేయాలి

పూతలపట్టు: సచివాలయ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని ఎంఈవో కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఎంఈవో కార్యాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ అంగన్‌వాడీలు, పాఠశాలల్లో తనిఖీ చేయాలన్నారు. ఎంపీడీవో గౌరీ, ఏపీఎం నాగరత్న పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

చిత్తూరు రూరల్: నగరంలోని గాయత్రినగర్‌లో ఇళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని పలువురు శనివారం స్థానిక మీడియాను ఆశ్రయించారు. వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నామన్నారు. అయితే ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు ఆ గుడిసెలను ధ్వంసం చేశారన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశామని, న్యాయం చేయాలని వారు కోరారు.

క్రైస్తవుల సంక్షేమానికి సర్కారు కృషి



మత పెద్దలతో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

చిత్తూరు రూరల్: క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. చిత్తూరు నగరంలోని బీటీ కాంపౌండ్‌లో జరుగుతున్న దహించు అగ్ని ఏసుక్రీస్తు వాగ్దాన స్వస్థత మహోత్సవాలకు డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాపులను రక్షించేందుకు దేవదూత రూపంలో ఏసుక్రీస్తు ఈ లోకంలోకి వచ్చారన్నారు. ఏసు మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. దహించు అగ్ని మినిస్ట్రీస్ థామస్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ క్రైస్తవుల పట్ల చూపుతున్న ఆదరణాభిమానాలను కొనియాడారు. జగన్‌కు క్రైస్తవులందరం ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మేయర్ అముద, రెవరెండ్ ఆర్ జోబ్, పాస్టర్ సెల్వి కుమార్, డేవిడ్ విల్సన్, రాబర్ట్ సెడ్రిక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి

- ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా జగనన్న పాలన
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



బొమ్మాయిపల్లెలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి చేకూర్చుతున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శనివారం మండలంలోని తిమ్మోజుపల్లె సచివాలయ పరిధిలోని బొమ్మాయిపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. దళితవాడ నుంచి శ్మశానానికి సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు 98 శాతం అమలు చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆదరిస్తే మరిన్ని పథకాలను తీసుకు వస్తారని పేర్కొన్నారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్లప్ప, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, దొరస్వామి, ప్రభు, బుజ్జి, ఏఎంసీ చైర్మన్ సోమశేఖర్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త ఈశ్వర్‌నాయుడు, సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘుపతిరాజు, పార్టీ పార్లమెంటరీ విభాగం కార్యదర్శి రఘు, ఎస్సీ, మైనారిటీ మండల సెల్ అధ్యక్షులు నాగరాజ, హిదాయత్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, ఎంపీడీఓ హరిప్రసాద్, తహశీల్దార్ బెన్నురాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

25న ప్రత్యేక క్యాంప్

తిరుపతి అర్బన్: మద్రాస్ రెజిమెంట్‌లో పనిచేసిన చిత్తూరు, తిరుపతి జిల్లా మాజీ సైనికులకు ఈనెల 25వ తేదీన చిత్తూరులోని గిరిమ్స్‌పేట జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించనుననట్టు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్ విజయశంకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో మద్రాస్ రెజిమెంట్‌లో పనిచేసిన మాజీ సైనికులకు సంబంధించి పింఛన్లు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదులో తప్పులు, చిరునామా మార్పు తదితర సమస్యలను పరిష్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మద్రాస్ రెజిమెంట్‌కు సంబంధించిన మాజీ సైనికులు సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం తేనెబండలో శనివారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడింది. మద్యం విక్రయిస్తున్న కన్నాపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి మరో వ్యక్తి పరారైనట్లు సీఐ జోగేంద్ర తెలిపారు.

కాలనీలకు మీటరు బోర్డులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని జగనన్న కాలనీలకు 10 వేల విద్యుత్ మీటర్ బోర్డులు వచ్చాయని ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఈఈ రమణ తెలిపారు. దీంతో పాటు 270 కిలో మీటర్ల సర్వీసు వైర్ వచ్చిందన్నారు. సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి మెటీరియల్‌ను జిల్లా స్టోర్ నుంచి తీసుకోవాలని తెలిపారు.

నేడు కాణిపాకంలో ఉభయదారుల సమావేశం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఉభయదారుల సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. దేవస్థానం అనుబంధ శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి 14 గ్రామాలకు చెందిన ఉభయదారులు, ఆలయ అధికారులు హాజరు కావాలన్నారు.

సచివాలయాల్లో 'స్పందన' తప్పనిసరి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఓ

యాదమరి: సచివాలయాల్లో రోజూ సాయంత్రం స్పందన కార్యక్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందిని ఆర్డీఓ రేణుక ఆదేశించారు. శనివారం ఆమె మండలంలోని కమ్మరాయనిమిట్ట పంచాయతీ కొనాపల్లె సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పథకాల బోర్డులను పరిశీలించారు. సమస్యలపై వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ చిట్టిబాబు, కార్యదర్శి దీపా పాల్గొన్నారు.

రీ సర్వే పక్కాగా ఉండాలి

భూ రీ సర్వే తప్పులు లేకుండా పక్కాగా ఉండాలని సర్వేయర్లుకు ఆర్డీఓ రేణుక సూచించారు. మండలంలో మోర్ధానపల్లె పంచాయతీలో జరుగుతున్న రీ సర్వేను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతుల సమక్షంలో రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలని తెలిపారు.

సచివాలయాల్లో స్పందన నిర్వహించాలి

ప్రతి రోజూ సాయంత్రం స్పందన కార్యక్రమం నిర్వహించాలని సిబ్బందికి డీఈఓ విజయేంద్రరావు సూచించారు. మండలంలోని మోర్ధానపల్లె సచివాలయాన్ని శనివారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలి

చిత్తూరు కలెక్టరేట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు. శిక్షణలో భాగంగా ఆయన శనివారం చిత్తూరు, తవణంపల్లె మండలాల్లో ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్, క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను, ఆ శాఖ ద్వారా అమలవుతున్న పలు పథకాలను పరిశీలించారు. చిత్తూరులోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఓల్డ్ ఏజ్ హోమ్, శిశు విహార్ కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ వివరాలను తెలుసుకున్నారు. పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు కలిగి ఉన్నారా లేదా అని వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో పలు నివేదికలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను ఐసీడీఎస్ పీడీ నాగశైలజ వివరించారు. నోడల్ అధికారి నిర్మల, ఈవో ధన, సీడీపీవోలు పాల్గొన్నారు.

విమర్శించడం సరికాదు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌జీవో సంఘాన్ని విమర్శించడం సరికాదని జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షులు రాఘవులు, కార్యదర్శి రఘు, కార్యవర్గ సభ్యులు మురళీమోహన్ తెలిపారు. వీరిద్దరూ ఆ సంఘ నాయకులతో కలిసి శనివారం జిల్లా ఎన్‌జీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండు రోజులుగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ, ఆ సంఘ సభ్యులు విమర్శలు చేయడం అనైతికమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమేష్, సుబ్రహ్మణ్యం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా హౌసింగ్ పనులు



స్పందన భవన నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిపై చర్చిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాల పనులు నిరంతరాయంగా జరగాలని, మార్చి 15 కల్లా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. కమిషనర్ శనివారం ఉదయం నగర పాలక సంస్థ పరిధిలోని తేనెబండ హౌసింగ్ లేఔట్ సందర్శించారు. ఇల్లు నిర్మిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. మార్చిలో సామూహిక గృహప్రవేశాలు చేపట్టాల్సి ఉన్నందున ఇళ్ల నిర్మాణాలను వేగంగా చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారుల కోరిక మేరకు ఇళ్ల నిర్మాణాల కోసం మేస్త్రీలను కేటాయించారు. ఇల్లు పూర్తి చేసేంతవరకు మేస్త్రీలు అందుబాటులో ఉండాలని కోరారు. లబ్ధిదారులు, మేస్త్రీలను రోజూ సమన్వయం చేసుకొని నిర్దేశించిన లక్ష్యంలోపు పనులు పూర్తి చేసేలా చూడాలని హౌసింగ్, వార్డు అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

ఐరాల: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులకు ఎంపీడీఓ నిర్మలాదేవి సూచించారు. శనివారం నాగవాండ్లపల్లె జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ లబ్ధిదారులకు రుణాలను గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్మాణాల విషయంలో పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన భవనం పనుల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టరేట్ ప్రాంగణంలో చేపట్టిన స్పందన కాన్ఫరెన్స్ భవన నిర్మాణ పనులను శనివారం అధికారులు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఇతర అధికారులు పనులను పురోగతిని పర్యవేక్షించారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల్లో నాణ్యత తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టాన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, పాల్గొన్నారు.